# స్ఫూర్తి

**-డా॥ శంకరమంచి శ్యాంప్రసాద్**

ప్రతీరోజు సాయంత్రం స్కూలు నుంచి ఇంటికి రాగానే ఆరోజు వచ్చిన ఉత్తరాలు, పుస్తకాలు చూసుకోవడం, అలాగే ఎవరైనా ఇంటికి ఫోను చేసిన వివరాలను రోజూ మా ఇంట్లో వాళ్లను వాకబు చేయడం నాకు రివాజు. నేనో ఉపాధ్యాయుణ్ణి కాబట్టి అందునా కొంత రచనా వ్యాసంగ వ్యసనం అబ్బినవాణ్ణి, అలవాటు చేసుకున్న వాణ్ణి కాబట్టి ఇదంతా నాకు మామూలే. ఒక్కొక్కసారి ఈ వ్యాపకంలో పడి ఇంటి వ్యవహారాలను సరిగా పట్టించుకోవడం లేదని కూడా నాపై అప్పుడప్పుడు నా భార్య మా అమ్మకు ఫిర్యాదు చేయ డం కద్దు. నా శ్రీమతి ఇంటి పనులు చక్కబెట్టుకోవ డంలో సమర్థురాలు కాబట్టే కాస్త అయినా ఈ మాత్రం గిలుకుతున్నానని నా జవాబు. ఈ విషయంలో మా అమ్మ సర్దుబాటుకు అనుకూలంగా తీర్పిచ్చే న్యాయ మూర్తిగా వ్యవహరించడం- మా ఇద్దరికీ ఆమెలో నచ్చే విషయం.

నాకు వచ్చే ఉత్తరాలు, పుస్తకాలు ఎక్కువగా విద్య, సాహిత్య రంగాలకి సంబంధించినవే కాబట్టి- అవెంతో ఆత్మీయంగాను, ఆలోచనాత్మకంగాను అనిపిస్తాయి. ఎప్పుడో, ఎక్కడో నేను రాసిన కవితనో, వ్యాసాన్నో, కథనో చదివి- అది బాగుంటే బాగుందని, లేకుంటే ఇలా ఉంటే మరింత బాగుండేదని సూచనలు, సల హాలు ఇచ్చేవారు లేకపోలేదు. ఏమైనా స్పందన ముఖ్యం అనిపిస్తుంది నాకు. జ్వాల రేపకపోయినా ఫరవాలేదు జోల పాడకుంటే చాలు నా రచనలు అనుకుంటాను. ఏమైనా రాసేమటుకే అది మనది. అచ్చయిన తర్వాత అది ప్రజలది. పత్రికలు కేవలం వాహికలు మాత్రమే.

ఈ రోజు సాయంత్రం ఇంట్లోకి అడుగు పెడు తూనే టేబుల్‌పై దృష్టి సారిస్తే మామూలుకంటె భిన్నంగా 'పోస్టు' కాస్త ఎక్కువగానే ఉంది. అయినా ఈ రోజు శనివారం కదా! రేపు వచ్చిన రచనలతో మంచి కాలక్షేపం అనుకున్నాను. ఒకటి రెండు కార్డుల్లో 'అభినందన'లుంటే మరో కార్డులో సూక్ష్మ విమర్శ ఉంది. ఒకటి రచనకు ప్రోత్సాహమైతే మరొకటి మరింత మంచి రచనకు ప్రోత్సాహమూ, మార్గదర్శ కమూ అనుకున్నాను. ఈ మూడింటి కింద మరో పెద్ద కవరు ఉంది. అది చూడగానే ఒక్కసారిగా నా మనసంతా నెమలి పురి విప్పుకున్నట్లయింది. ఆకా శంలో హరివిల్లు విరిసినట్లయింది. తోటలో మొగ్గలన్నీ ఒకేసారి వికసించినట్లయింది. అలసట ఆవిరై పోయింది. నా ప్రసన్నవదనాన్ని గమనించి నా శ్రీమతి అడగనే అడిగింది చాయ చేతికందిస్తూ. ఏమిటి ఆ ఆహ్వానంలో అంత ఆనందం ఉందా? ఉండదు మరి- ఆనందం కాదు అందులో అనుభవం ఉంది. జీవితం ఉంది. చెప్పలేని అనుభూతి ఉంది అన్నాను. ఇంతకీ ఏమిటీ ఆహ్వానం, ఎందుకీ వర్ణన, చెప్పేదేమిటో కవి

## అక్షరం!

**అ**క్షరం!...?...!
చదువును నేర్పుతుంది
విజ్ఞానాన్నిస్తుంది
ప్రగతికి మార్గదర్శిగా నిలుస్తుంది
మర్యాదను దక్కిస్తుంది
మన్ననలను అందిస్తుంది
మహాప్రభో... అనిపిస్తుంది
మహామహులుగా చేసేస్తుంది
అక్షరం ఓ ఆయుధం
అక్షరమంటే శారదా ప్రసన్నం
అందుకే అది ఓ వరం
తెలుసుకుంటేనే తెలుస్తుంది దాని మర్మం
తెలివి కలిగి నేర్చుకో అక్షరం
తొలగించుకో నీలోని అజ్ఞాన తిమిరం
అందుకే పలకను పట్టు
అక్షర యజ్ఞం చేపట్టు
బ్రతుకు బాగుచేసుకో
నీ తల రాతను మార్చుకో
అక్షరయజ్ఞం సాగించు
అజ్ఞాన తిమిరాన్ని తొలగించు
అక్షర దీపాన్ని వెలిగించు
సదా అక్షరంబె ఆయుధమని నిరూపించు!

**-దోసపాటి సత్యనారాయణమూర్తి**

త్వంలో కాక సూటిగా చెప్పండి అంటూ ప్రశ్నించింది.

మనిషి సంఘజీవి కదా! బ్రహ్మాండం బద్దలయినా బాధను కప్పిపుచ్చుకోలేడు. ఆనందాన్ని ఆపుకోలేడు. ప్రస్తుతం నా పరిస్థితీ అంతే. అయితే నాకిది సంతోషం. ఒకనాడు కష్టాల కొలిమిలో కాలిపోతుంటే కాపాడిన వాడు. ఎడారి ప్రయాణంలో ఒయాసిస్సులా సేదదీర్చిన వాడు. కారు చీకటిలో కాంతి కిరణమై వెలుగునిచ్చిన వాడు. అదే.. మా పూర్వ ప్రధానోపాధ్యాయులు, దూరపు చుట్టరికానికి 'తాతగారు'గా సుప్రసిద్ధులైన మా శేషగిరిరావుగారి 'శతవర్ష జన్మదిన మహోత్సవం' – అదే తాలూకూ ఆహ్వానం. 'బతుకుంటే నూరేళ్ల పండగ' అంటారు. కాని ఎంతమంది. మధ్యలో పడి పోయే వికెట్లే ఎక్కువ. అందునా భారతదేశపు సగటు ఆయుర్దాయం అరవై ఐదు ఏళ్లేగా! అయినా ఈ లెక్కల కోసం కాదు నా సంతోషం. నా సంతోషానికో గత ముంది. స్వగతముంది. ఈ 'ఆహ్వాన పత్రం' చూడగానే నా ఆలోచనల జడిలో ఒక్కొక్క అల ఎగిసి బయట పడుతుంది. సినిమా తెరపై ఒక్కొక్క బొమ్మ వచ్చి వెళ్లినట్టుగా నా మనోనేత్రంలో ఒక్కొక్క మలుపూ కన బడుతుంది. అందులో ఎన్నో మైలురాళ్లు. కొన్ని పోటు రాళ్లు. తాతగారు నా జీవిత ప్రస్థానంలో కచ్చితంగా మైలురాయే. అందుకే ఇరవై ఏళ్లయినా ఆ స్మృతులన్నీ సుమాల్లాగా సువాసనల్ని వెదజల్లుతున్నాయి.

అప్పుడు నేనొక నిరుద్యోగిని. 'పట్టణంలో బతుకు దామని బయలుదేరిన బాటసారిని. జీవితాన్ని పూర్తిగా చదువుకు అంకితం చేయలేను. అలా అని ఆ కోర్కెను అణచుకొని ఉద్యోగమూ చేయలేను. నా చదువుకు ఉపాధి ఆలంబన కావాలి. అలాగే నా ఉపాధికి చదువు ఆలంబన కావాలి.. ఎలా? ఎలా? అవ్వా, బువ్వా కుదరవన్నారు ప్రబుద్ధులు. కాని నాకు చదువు, ఉపాధి రెండు కావాలి. అందుకే బాగా ఆలోచించి ఒక నిర్ణ యం తీసుకున్నాను. ఈ రెండూ ఏక కాలంలో సాధ్యం చేసుకోవాలనుకున్నాను. సగటి పూట పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ రాత్రిపూట కళాశాలలో విద్యార్థిగా చదువుకోవాలని. అనుకున్నదే తడవుగా నగరంలో ఉన్న చిన్న చిన్న ప్రైవేటు పాఠశాలల్ని సంప్ర దించడం మొదలుపెట్టాను. చాలామంది ప్రైవేటు స్కూళ్లు – సమస్యల గూళ్లు అంటుంటారు గాని, గ్రామీణ ప్రాంతంలో ఉన్నత విద్యావకాశాలు లేక, పేదరికంతో బాధపడే ఎంతోమందికి ఉపాధి పరంగా ఒకవైపు ఆర్థికపరమైన చేయూతనందిస్తూనే వారి ఉన్నత విద్యాభ్యాసానికి అవకాశాన్ని కల్పిస్తున్న నగర కుటీర పరిశ్రమలు– ఈ పాఠశాలలు. నిరుద్యోగుల అవసరాన్ని అవకాశంగా భావించే మేనేజ్‌మెంట్లు లేకపోలేదు. అదంతా మరో కథ.

–అన్నీ స్కూళ్లకు వెళ్తున్నట్టుగానే ఆ స్కూలుకు వెళ్లాను. అక్కడ మొదటి గదిలోనే సుమారు ఎనభై, ఎనభై అయిదు ఏళ్ల వయసున్న పెద్దమనిషి కూర్చొని

## మినీ కవితలు

### ఆదర్శం

కాళ్ళతో తొక్కుతున్నా
మంటల్లో కాలుస్తున్నా
భరించేదెందుకో తెలుసా!
కొన్నాళ్ళే బతికినా
కుండై / చల్లదనం పంచాలని!

### జీవితం

పచ్చని
దేహం చెట్టు
కట్టెగా మారింది–
గుండె గూడులో
ప్రాణం పక్షి
లేచిపోయేసరికి!

### లౌక్యం

సీసాలో
పానీయం
ఎలాంటిదైనా
చల్లదనం వుంటేచాలు–
అందరూ మెచ్చుకుంటారు!

### తపోభంగం

డబ్బు
పదవి
మద్యం
మగువలతో
ఇంద్రుడు వలలు పన్నాడు–
మనిషి "ఋషి"కి భయపడి!

–రావి రంగారావు

ఉన్నాడు. గది బోర్డు చూస్తే 'హెడ్మాస్టర్' అని ఉంది. ఇది నాకూ ఒక విచిత్ర అనుభవం- వినూత్న అనుభవం - ఏ స్కూలుకు వెళ్లినా 'గుడ్ మార్నింగ్' అంటూ పలుకరింపే కాని ఈ పెద్దమనిషిని చూడగానే భారతీయతకు ప్రతీకగా, ఖద్దరు లాల్చీ ధోవతి ధరించి చూడడానికి స్వాతంత్ర్య సమరయోధుడుగా ఉన్నాడనిపించి రెండు చేతులెత్తి సంప్రదాయబద్ధంగా నమస్కరించాను. ఒకసారి నన్ను ఎగాదిగా చూచి రండి, కూర్చోండి అంటూ కుర్చీ చూపించారు. ఇంతలోనే ఆయా చల్లని మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది. నగరంలో 'నాగరికత' చావలేదనుకున్నాను.

నా సమస్యను చెప్పబోతుంటే "మా ముందు మీరో క్లాసు తీసుకోండి, తర్వాత మాట్లాడదాం" అంటూ తరగతి గదికి తీసుకువెళ్లారు. తిక్కనగారన్నట్లు 'అతడనేక యుద్ధముల ఆరితేరినవాడని' తెలిసింది. ప్రతీ సబ్జెక్టులో ఆయన ప్రవేశం. నాన్యతోదర్శనం. నాకు ప్రభుత్వోద్యోగం వచ్చేవరకు అక్కడే పనిచేశాను. చదువు పెరిగింది. చైతన్యం పెరిగింది. అలాగే ఆయనతో చనువు పెరిగింది. అలా నాకు వారు తాతగారయ్యారు. స్కూల్లో 'సార్' అయినా ఆ గేటు దాటితే మళ్లీ నాకు ఆయన తాతగానే. నీతి, నిజాయితీ, మానవతా విలువలకు ఆయనో ప్రతిరూపం. సబ్జెక్టులో సమర్థుడు. వ్యక్తిగా సహృదయుడు. ఆయన్నుంచి విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటే మేం జీవితాన్ని నేర్చుకున్నాం. ఆయనే మాకొక 'రిఫరెన్స్ బుక్' అంటే అతిశయోక్తి కాదు. ఏ రోజు దిద్దాల్సిన నోట్సును ఆ రోజే దిద్దడం, ఒక్కమాటలో చెప్పాలంటే ఎప్పటి పనిని అప్పుడే చేయడం ఆయన నైజం.

అయితే రెండేళ్లుగా ఆ స్కూల్లో పనిచేస్తున్నా కాని ఎందుకో నా మనసును తొలిచేస్తున్న తాతగారి పరమైన ఒక సందేహం అలాగే ఉండిపోతోంది. 'గుండె గొంతులోన కూసుండనీదు' అన్నట్లుగా- ఆ రోజు ఉదయం తాతగారు స్కూలుకు రాగానే సాయంత్రం నీతో పని ఉంది. ఓ గంటసేపు నాతో పాటు సికింద్రాబాదు స్టేషన్కు రావాలన్నారు. సరే అన్నాను. తాతగారు విశాఖపట్నం వెళ్తుంటే రైలు ఎక్కించడానికని నేనూ స్టేషన్కు వెళ్లాను. ట్రెయిన్ గంటన్నర ఆలస్యం. చేసేది ఏం లేక అలాగే ప్లాట్ఫాం కుర్చీలపై కూర్చొని ఉన్నాం. ఈ లోపే తాతగారు ఏమనుకున్నారో ఏమో తమ జీవిత చిట్టాలోని ఒక ముఖ్యాంశాన్ని విప్పడం మొదలు పెట్టారు. నేను బస్సుగాని, రైలుగాని ఎక్కుతున్నప్పుడు చుట్టుపక్కల వాళ్లు ముసలాయనైనా ఎంత చక చకా ఎక్కేస్తున్నాడని అంటుంటారు. ఈ మాటలు విన్నప్పుడు నాకు లోలోన సంతోషం కలుగుతుంటుంది. నేనింకా ఆరోగ్యంగానే ఉన్నానని. ఇంకా కొన్నేళ్లు ఈ ఉద్యోగం చేయొచ్చని. ఈ వయసులో ఈ ముసలాయన 'రామా కృష్ణా' అంటూ ఇంట్లో కూర్చోక ఎందుకీ ఉద్యోగం చేస్తున్నాడని అనుకొంటుంటారు. నాకొక్క బిడ్డ. అల్లుడు రైల్వేశాఖలో పనిచేస్తుంటాడు. మనవలు మనుమరాళ్లూ ఉన్నారు. ఇంట్లో వాళ్లూ వద్దంటారు. నేనేమో అటు సంప్రదాయం వదులుకోలేని వాణ్ణి. ఇటు ఆధునికతను ఆహ్వానించలేని వాణ్ణి. అమ్మాయి ఇంట్లో ఉంటో వాళ్ల సొమ్ము తినడం ఎలా? రేపు అనారోగ్యం పాలయితే వాళ్లేగా చూడాల్సింది. ఆ శ్రమ వాళ్లకిప్పుడే ఎందుకు ఇవ్వడం. భార్యా పోయింది. స్కూలులో పనిచేస్తున్నప్పుడు పిల్లలకు నేర్పడంతో పాటు నేనూ ఎన్నో నేర్చుకుంటున్నాను. వాళ్ల ఉత్సాహం, పట్టుదల నాకూ ప్రేరణ అవుతున్నాయి. అయితే నేనో ముసలి విద్యార్థిని అంటూ నవ్వేశారు. అలాగే నా సందేహము తొలగిపోయింది.

ఆ తర్వాత కొన్నేళ్లకు నేను ప్రభుత్వోద్యోగంలో చేరడం, తాతగారి కుటుంబం విజయవాడలో స్థిరపడటమూ జరిగింది. అయినా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. ఆ మధ్య ఆయన స్వగ్రామంలో వచ్చీపోయే ప్రయాణీకులకు నిలువ నీడలేక ఇబ్బందిగా ఉందని చెప్పి తనకున్న కొద్దిపాటి మొత్తంలోనే బస్సు షెల్టరు నిర్మించారు. తాతగారు మంచి కవి కూడా. ఆ సందర్భంలోనే సరళ శైలిలో రామాయణాన్ని రాసి వాత్సల్యంతో నాతో సరదాగా ముందుమాట రాయించుకున్నారు. మనవడు చిన్నప్పుడు తప్పటడుగులు వేస్తుంటే చూసి ఆనందించడం పెద్దవాళ్లకో సరదా కదా! అదే ఇదీ అనుకున్నాను. అదో తృప్తి. ఇదిగో మళ్లీ ఇన్నాళ్లకు ఆయన పూర్వ విద్యార్థులు, మనవలు-మనవరాళ్లూ కలిసి చేస్తున్న 'నూరేళ్ల పుట్టిన రోజు పండగ.'

ఇది ఆయన వయసుకు కాదు 'మనసు'కు చేస్తున్న పండగ. అవునూ! ఇంతకీ ఎప్పుడో చెప్పలేదుగదూ! ప్రకృతీ రామణీయకతతో, కోయిల కుహూ కుహూ రాగాలతో తెలుగు జాతి వైభవంగా జరుపుకునే ఉగాదే ఆ శుభ తరుణం.

ఆ రోజు కోసం చకోరంలా ఎదురు చూస్తున్నాను. తాతగారి జ్ఞాపకాలన్నీ నాకో స్ఫూర్తి. ■